క్లుప్తంగా

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి

యద్దనపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు కొనుగోలు చేసే రైతులు ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారి సీహెచ్ ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన చేసిన తరువాత మొలకశాతం 85 శాతం ఉంటే మంచి విత్తనాలుగా భావించాలని లేనిపక్షంలో తిరిగి విత్తనాలను దుకాణదారులకు ఇచ్చివేయాలన్నారు. విత్తనాలు నాటిన తరువాత పంట కాలం ముగిసే వరకు రసీదు, విత్తనాల సంచిని భద్రపరుచుకోవాలన్నారు. లైసెన్స్ లేని వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు



రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తతతో తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ అన్నారు. సోమవారం కొణిదెన గ్రామపంచాయితీ కార్యాలయంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో మురుగు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, మురుగ నిల్వలు ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమకాటు వల్లే మలేరియా, టైఫాయిడ్ డెంగీ జ్వరాలు సోకే ప్రమాదం ఉందని వైద్యులు వివరించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇడుపులపాడులో తిరునాళ్లు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ పోలేరమ్మ అమ్మవారి 21వ తిరునాళ్ల మంగళవారం జరుగుతుందని దేవాలయ నిర్మాణ దాతలు అంబటి చెంచు సుబ్బారావు, సంజీవరావులు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని విద్యుద్దీపాలంకరణలతో, విద్యుత్ ప్రభలతో, కోలాట భజనలతో మేళతాళాలతో కార్యక్రమాన్ని నిర్వహించటేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పుస్తకాల అక్షయపాత్ర

- ఈ-లైబ్రరీతో విద్యార్థులకు ఉపయోగాలు
- కొనుగోలు చేసే పనిలేకుండానే విలువైన పుస్తకాలు వెబ్‌సైట్‌లో
- ఓపికతో శోధిస్తే విజ్ఞానం సొంతం
- అన్ని రకాల పాఠకులకు ఉపయుక్తం అంటున్న లైబ్రేరియన్లు



అద్దంకి: కాలం మారింది. కాలానుగుణంతో పాటు వ్యవస్థలు మారాయి. అందుకు తగ్గట్టుగానే ప్రేక్షకుల రుచికూడా భిన్నంగా ఉంటోంది. ఒకప్పుడు పుస్తకమో, దినపత్రికలో లేదా మరో పుస్తకం చదవాలంటే గ్రంథాలయానికి వెళ్లి చదువుకునేవారు. అటువంటి గ్రంథాలయాలు సైతం ఆధునిక సాంకేతికవైపు అడుగులు వేసింది. రాము అనే విద్యార్థికి ఇంజినీరింగ్‌లో మంచి ర్యాంకు వచ్చింది. కోరుకున్న కాలేజీలో సీటు లభించింది. దాంతో ఆ కుటుంబం సంతోషించింది. కోట్లలో ఫీజు చెల్లించే అవసరం లేదని సంతోషపడ్డారు. వేలాది రూపాయల్లో ఉన్న పుస్తకాల ధరను చూసి ఏం చేయాలో తెలియక తికమకపడుతున్న ఆ విద్యార్థికి సీనియర్ విద్యార్థి ఒకడు తారసపడి ఈ-లైబ్రరీ గురించి వివరించాడు. అప్పుడే ఆ విద్యార్థి ఇంటర్‌నెట్ సెంటర్‌కు వెళ్లి రూ.10 చెల్లించి తనకు కావాల్సిన సమాచారాన్ని సులభంగా తెలుసుకున్నాడు. రాము ఒక్కడే కాదు ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థుల్లో పేద విద్యార్థులందరూ ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇదే రకమైన ఇబ్బంది కలగడం సహజం. అలాంటి వారు ఈ-గ్రంథాలయంపై అవగాహన కలిగి ఉంటే విజ్ఞానాన్ని ఇచ్చే పుస్తకాలతోపాటు ఉన్నత విద్యా పాఠ్యపుస్తకాల చదివి విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చని ఇంజినీరింగ్ అధ్యాపకులు చెప్తున్నారు. పాఠ్యాంశాలే కాకుండా వ్యక్తిత్వ వికాసం, ఆంగ్లభాష, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అనేకం లభ్యం అవుతాయి.

విజ్ఞాన సముపార్జన కోసం..

ప్రస్తుతం జిల్లాలోని బాపట్లలో పేరుమోసిన ఇంజనీరింగ్ కళాశాలతోపాటు, వివిధ పట్టణాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ, నాలుగైదు చోట్ల ఈ-గ్రంథాలయాలు ఉన్నాయి. విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవచ్చు. గతంలో వేలల్లో ధర ఉన్న పుస్తకాలను అద్దెకు తీసుకుని వచ్చి చదువుకుని తిరగి ఇచ్చేవారు. ఇప్పుడా పద్ధతి చాల్లా చోట్ల లేదు. ఫలితంగా విషయాన్వేషణలో అవరోధాలు కలుగుతున్నాయి. అలాంటివారికి అందుబాటులో ఉండే ఈ-గ్రంథాలయం గొప్పవరం అని చెప్పవచ్చు. ఇంజినీరింగ్, మెడిసన్, ఐటీ కోర్సుల పుస్తకాల ధరలు ఈ ఏడాది రూ.50 నుంచి రూ.100 వరకు పెరిగినట్లు చెప్తున్నారు. ఇంజినీరింగ్ పుస్తకాల కోసం ఒక్కో పుస్తకం కోసం విద్యార్థి రూ.600 నుంచి రూ.1000కి పైగా వెచ్చించాల్సి ఉంటుంది. ఎంబీఏ, మెడిసిన్, ఎంసీఏ పుస్తకాలు సైతం ఇదే ధర పలుకున్నాయి. రూ.1000 వెయ్యికి తక్కువగాఎక్కడా పుస్తకాలు దొరకవు. అయితే కళాశాల గ్రంథాలయాల్లోనే విద్యార్థుల కోసం డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

వెబ్ సైట్లు ఇవే..

- డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. నేషనల్ లైబ్రరీ.కామ్
- డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. బుక్ బూమ్.కామ్
- డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. మెడికల్ స్టూడెంట్ .కామ్
- డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. కాంపిటీటివ్.కామ్

ఈ గ్రంథాలయంలో అనేక పుస్తకాలు..



ఈ - లైబ్రరీ విద్యార్థులకు ఒక వరం వంటిది. గ్రంథాలయ శాఖకూడా ఆ విధంగా దృష్టి సారిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి గ్రంథాలయంలో ఈ-గ్రంథాలయాన్ని, నెట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఓపికతో వెతికితే దొరకని పుస్తకం అంటూ ఉండదు. పుస్తకాలు దొరకవన్న చింత ఉండదు. కొత్త వెర్షన్ మార్కెట్‌లోకి రాకముందే ఈ గ్రంథాలయంలో దొరుకుతుంది.

– సుగుణరావు, లైబ్రేరియన్ అద్దంకి

ఎన్నెన్నో పుస్తకాలు..

పోటీ పరీక్షలకు ఈ-గ్రంథాలయాలు అక్షయ పాత్ర వంటివి అని చెప్పవచ్చు. విశిష్టమైన వ్యక్తుల జీవిత చరిత్రలు, చారిత్రక ఘటనలు, అరుదైన గ్రంథాలను చదివి లోతైన విషయ పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే డబ్బు చెల్లించినా మన గ్రంథాలయాల్లో దొరకని ఎన్నో అమూల్యమైన పుస్తకాలు పొందవచ్చు. చాలా పుస్తకాలను ఉచితంగా కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఒక వేల డౌన్‌లోడ్‌కు పేమెంట్ ఉన్నా బయట పుస్తకాని వెచ్చించాల్సినంత ధర ఉండదు.

సేంద్రియ సాగుతో రైతులకు మేలు



విత్తనాల కిట్‌లు తయారు చేస్తున్న సిబ్బంది

వేటపాలెం: సేంద్రియ సాగుతో రైతులకు నాణ్యమైన దిగుబడులతో పాటు భూమి సారవంతమవుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పీఎండీఎస్ విత్తనాల కిట్‌లను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్టె, పూల జాతి, కూరగాయలు, ఆకు కూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాల వంటి వివిధ రకాలు కలిపి 15 కిలోల పరిమాణంలో కిట్‌లు తయారు చేశామన్నారు. ఈ పీఎండీఎస్ కిట్‌లను రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయిస్తారని చెప్పారు. ప్రకృతి సాగు చేసే రైతులు పంట సాగుకు ముందస్తుగా వారి పొలాల్లో ఈ కిట్‌లో విత్తనాలు వెదజల్లడం ద్వారా పండే ఫలసాయంతో పాటు, పచ్చిరొట్టె పైరుగాలాగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇటు భూమి సారవంతం చేసుకోవడంతో పాటు రైతులకు ఈ చిరుధాన్యాల ద్వారా వచ్చే పంట దిగుబడులు లాభాసాటిగా ఉంటాయని తెలిపారు. ఈ కిట్‌లు పొందే రైతులకు ప్రభుత్వం స్కీమ్‌ల్లో అర్హత సాధిస్తారని తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ రపీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చీరాల టౌన్: మండలంలోని తోటవారిపాలెంలో కొలువైఉన్న కోరిన కోర్కెలు తీర్చే తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి 55వ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరగనుంది. తిరునాళ్ల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తిరునాళ్ల రోజున శిడిమాను ఊరేగింపు, శిడిపెళ్లి కొడుకుతో గ్రామోత్సవాన్ని మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగింపును చేస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ప్రత్యేక ఆకర్షణగా జెయింట్ వీల్స్, విద్యుత్ ప్రభలు, వివిధ రకాల తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్లలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు బాపట్ల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన భక్తులు వేలాది తరలిరానుండటంతో పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ మళ్లింపు చేశారు.


వైద్యశాలకు మెటీరియల్ బహూకరణ



మెటీరియల్ అందజేస్తున్న దాత లక్ష్మీనారాయణ తదితరులు

చినగంజాం: చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కట్టుగుడ్డ సామగ్రిని దాతలు సోమవారం వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్‌కు అందజేశారు. మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పల్లపోలు లక్ష్మీనారాయణ కుమారుడు ప్రవాసాంధ్రుడు పల్లపోలు సురేంద్ర ఆర్థిక సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మెటీరియల్‌ను అందించడం ద్వారా రోగులకు పూర్తి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దాతలకు వైద్యాధికారి ఈ సందర్భంగా తన కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో టీ జయరావు, ఎస్ శ్రీనివాసరావు, పీ పద్మనాభయ్య, ఏసునారాయణ, ఎస్ పాపారావు, జీ నరసింహారావు, ఎస్ రాము, జీవీనారాయణ, ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్ భవానీ, డాక్టర్ పీ సాయిశ్రీ చరణ్, ఝాన్సీరాణి, సూపర్‌వైజర్‌లు చిరంజీవి, ఉల్దారాణి మురళి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం







పాఠశాలలో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహం, మహాత్మా పూలే విగ్రహం, సావిత్రిబాయి పూలే విగ్రహం

బల్లికురవ: జన్మనిచ్చిన గ్రామంపై మమకారంతో ఓ ఉపాధ్యాయుడు, తాను గ్రామస్తుల సహకారం సుమారు రూ.1.5 లక్షలతో విద్యావేత్తల కాంస్య విగ్రహాలు, మంచినీటి మినీ ట్యాంకు ఏర్పాటు చేశారు. మండలంలోని అంబడిపూడి గ్రామంలోని శివాయలం ప్రక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను నాడు–నేడుతో అభివృద్ధి పరచటంతో రూపురేఖలే మారాయి. ఆ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కోవూరి ఏడుకొండలు పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ, విద్యావేత్తలు మహాత్మా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాను ఏర్పాటు చేయాలని భావించారు. గ్రామస్తుల సహకారం తీసుకుని ముగ్గురు విగ్రహాలను ఏర్పాటు చేసి గత విద్యా సంవత్సరంలో లాంఛనంగా ఆవిష్కరించి పాఠశాలకు అప్పగించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులతోపాటు ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు ప్రతి రోజు ఈ విగ్రహాలను ఆరాధిస్తున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న కాలనీలో గ్రామంలో మంచినీటి సమస్య ఉంది. అంబడిపూడి రక్షిత మంచినీటి పథకం నుంచి బల్లికురవకు వెళ్లే పైపులైన్ నుంచి పాఠశాలకు కనెక్షన్ తయించి 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినీట్యాంకు, కుళాయిలను ఏర్పాటు చేశారు. గ్రామం కాలనీతో పాటు వల్లాపల్లి గ్రామస్తులు ప్రతి రోజు ఇక్కడ సురక్షిత మంచినీరు పట్టుకుని తీసుకువెళ్తున్నారు. పక్కనే శివాలయం ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఈ ట్యాంకు కుళాయిలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పాఠశాలలో విగ్రహాల ఏర్పాటుకు మంచి నీటి మినిట్యాంకు ఏర్పాటుకు సహకారం అందించిన గ్రామస్థులకు ఏడుకొండలు మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.



ఏర్పాటు చేసిన రక్షిత పథక మినీ ట్యాంకు

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు



మండలస్థాయి ఎద్దుల పోటీలు ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం రెండో రోజు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో మహిళలు భక్తులు సద్ది, పడపొప్పు పానకం వెంట తీసుకొని గ్రామంలోని ప్రధాని వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గ్రామ పొలిమేరలోని పోలేరమ్మ ఆలయం వద్ద అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలేరమ్మ తిరునాళ్లకు పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి ఎద్దుల పోటీలను ప్రారంభించారు. గ్రామ పెద్దలు పోటీలను ప్రారంభించక మండలంలోని పలు గ్రామాల నుంచి ఎద్దులు యజమానులు పోటీలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పోలేరమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నేల సారంతో పంటలకు మేలు

- నేలను సారవంతం చేసుకునేందుకు ఇదే సరైన సమయం
- రైతులకు వ్యవసాయాధికారి సూచనలు, సలహాలు



శ్రీనివాసరావు, ఏవో



పశువుల ఎరువును పొలాలకు తరలిస్తున్న రైతులు

మేదరమెట్ల: పంటను సాగుచేసే భూములు, సారవంతంగా ఉండి, ఆరోగ్యంగా ఉంటేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. లేకుంటే ఎంత పెట్టుబడి పెట్టినా ప్రయోజనం ఉండదు. అలా నేలలను సారవంతం చేసుకునేందుకు, అనువైన సమయం ఇదేనని మండల వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు చెబుతున్నారు. వర్షాలు, రుతుపవనాల సమయంలోనే పొలాలకు అందించాల్సిన సేంద్రియ, సహజ బలాలను అందించడం అత్యంత అవసరం అని వివరిస్తున్నారు. భూసార పరీక్షల ప్రకారం మన ప్రాంత నేలల్లో సేంద్రియ కర్బన శాతం 3 శాతంగా ఉండేది. రైతులు విచ్చలవిడిగా రసాయనల ఎరువుల వాడకం వలన, అది ప్రస్తుతం 0.2 శాతానికి తగ్గిపోయింది. తిరిగి పూర్వ స్థితికి రావాలంటే, రైతులు కొన్ని పద్ధతులను పాటించక తప్పదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

నాడెప్ కంపోస్టు ఎరువులు..

పంట కోసిన తరువాత మిగిలే దుంపలు, పశువుల పేడ, మట్టి, నీరు కలిపి పొరలు పొరలుగా నాడెప్ కంపోస్టు తొట్లలలో, పేర్చి రెండు నెలల పాటు ఉంచాలి. అలా ఉంచడం వలన, భూమికి అవసరమైన పోషకాలు కలిగిన, సేంద్రియ ఎరువు తయారు అవుతుంది. సాధారణంగా వేసే కంపోస్టు కన్నా ఇలా తయారు చేసుకున్న కంపోస్టు నాలుగు రెట్లు అధిక పోషకాలు కలిగి ఉంటుంది. దీన్ని పొలంలో వేసుకోవడం వలన ఏడాది పొడవునా మొక్కలకు పోషకాలను సమంగా అందిస్తుంది. తద్వారా మొక్కలు బాగా ఎదుగుతాయి.

కంపోస్టు ఎరువులు..

పంటల అవశేషాలైన వరిపొట్టు, శనగపొట్టు, మినపకంప, పచ్చిఆకులు, ఆవు పేడ, నీరు కలిపి చెట్ల వద్ద గుట్టగా వేసుకోవాలి. అలా వేసుకున్న గుట్టపై వరి గడ్డిని కానీ, కొబ్బరి ఆకులను కానీ, తాటి ఆకులను కానీ కప్పిం ఉంచాలి. ఇలా మూడు మాసాల పాటు ఉంచిన ఎరువును తేమశాతం ఉన్నప్పుడు పొలంలో వేసి దున్నుకోవాలి. ఇలా తయారైన ఎరువును పండ్లతోటల్లో ఎరువుగా కూడా వేసుకోవచ్చు.

జీవాల విసర్జకాల ఎరువు..

గొర్రెలు, మేకలు విసర్జకాలను, ఎరువులుగా, పొలంలో వేసుకోవడం వలన మొక్కలకు రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు వీలు కలుగుతుంది. ఈ ఎరువును వేయడం వలన ఆభూమిలో పండే పంటలకు తెగుళ్లు త్వరగా ఆశించవు. అందుచేత జీవాల ఎరువును పొలంలో వేసుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

పశువుల ఎరువు, చెరువు మట్టి..

బాగా కుళ్లిన పశువుల ఎరువును ఎకరాకు కనీసం ఆరు టన్నుల చొప్పున వేసుకోవడం వలన భూమిలో కావలసినంతగా నత్రజని, పొటాష్, భాస్వరం అందుబాటులో ఉంటాయి. ప్రతి మూడు సంవత్సరాలకొకసారి ఎకరాలకు 20 బండ్ల చెరువు మట్టిని పొలంలో తోలుకోవడం వలన భూమిలో తేమశాతం తగ్గకుండా ఉండేందుకు వీలుంటుంది. దీనివలన పంట దిగుబడులు కూడా పెరిగేందుకు వీలు కలుగుతాయి. అలాగే జీవామృతం, ఘన జీవామృతం, మ్యాజిక్ కంపోస్టు, పంచగవ్య, అమృతజలం, చెరకు మడ్డి, వర్మికంపోస్టు వంటి వాటిని ఎరువులుగా పొలంలో వేసుకోవడం వలన కూడా నేలలు సారవంతంగా మారడం ద్వారా తిరిగి భూమిలో కర్బన శాతం పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, ఆశ్లేష నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రానధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు పోలేరమ్మ అమ్మవారి శిడులు



పోలేరమ్మ అమ్మవారు



విద్యుత్ కాంతులతో అలంకరించిన ఆలయం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వెలసిన పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం శిడులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సాయంత్రం గొర్రెల పెంపకందారులు ప్రత్యేకంగా అమ్మవారికి పొట్టేళ్ల ప్రభలతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వేద పురోహితులకు వస్త్రదానం



వేద పురోహితులు, విద్యార్థులకు వస్త్రదానం చేస్తున్న శేషయ్య

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని అయ్యప్పనగర్‌లో మురళీ కృష్ణ మందిరం ఎదురు భరద్వాజ మహర్షి వేద పాఠశాలలో వేద విద్య అభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులకు, ఐదుగురు వేద పురోహితులకు ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య చేతుల మీదుగా సోమవారం వస్త్రదానం చేశారు. వేద పాఠశాల గురువులు, వేద పురోహితులైన నేల్లంబొట్ల సదాశివయ్య, కంచి కామాక్షి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావుశర్మ, సీతారాంపురంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు భారతుల శ్రీనివాసశర్మ, గొడుగుపాలెంలోని రామ మందిరం అర్చకుడు మహంకాళి మురళీకృష్ణశర్మ, అర్చక స్వాములు రాము శర్మ, భరద్వాజ మహర్షిలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం వేద విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు, వేద పురోహితులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.